7

సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



**చీనీ టన్ను రూ.18 వేలు**

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



**కిలో టమాట రూ.26**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.2°/21.1°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### బంతి పూలహారం @ రూ.71,000



స్వామివారి పూలమాలతో జీరిగేపల్లి చెందిన నగేష్

**రొళ్ల:** మనం ఇప్పటి వరకూ రూ.లక్షల్లో పలికిన వినాయకుడి లడ్డూ వేలం చూసి ఉంటాం. కానీ రొళ్ల మండల పరిధిలోని జీరిగేపల్లి గ్రామంలో మాత్రం వినాయకుడి మెడలోని పూలహారం ఏటా వేలం వేస్తారు. ఈ సారి కూడా సోమవారం వినాయకుడి మెడలో అలంకరించిన పూలహారం వేలం నిర్వహించగా.. గ్రామస్తులు భారీగా పోటీ పడ్డారు. చివరకు రొళ్ల వీరనాగమ్మ వైన్స్ యజమాని నగేష్ ఏకంగా రూ.71,000కు వినాయకుడి మెడలోని పూలహారాన్ని దక్కించుకున్నారు.

**బంతి పూల మాలకు భారీ రేటు..**

జీరిగేపల్లి గ్రామంలో ఏటా వినాయక చవితి రోజున స్వామివారి మెడలో ప్రత్యేకంగా తయారు చేసిన బంతిపూల మాల వేస్తారు. ఐదో రోజు నిమజ్జనం సందర్భంగా ఆ పూలమాలను వేలం వేస్తారు. వేలం పాట ద్వారా వచ్చిన డబ్బును మరుసటి సంవత్సరం స్వామివారిని కొలువుదీర్చేందుకు ఉపయోగిస్తారు. వినాయకుడి మెడలోని పూలమాలను దక్కించుకున్న వారికి మంచి జరుగుతుంది గ్రామస్తులు విశ్వాసం. అందుకే మామూలు బంతిపూల మాల కూడా ఇక్కడ రూ.వేలు పలుకుతోంది.

### 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్'లో నమోదు చేసుకోండి

**అనంతపురం ఎడ్యుకేషన్:** జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తప్పనిసరిగా స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో మంగళవారంలోపు రిజిస్టర్ చేసుకోవాలని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ సూచించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, సైన్స్ పరిశోధన సంస్థ సంయుక్తంగా అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థుల్లో సైన్స్ పట్ల జిజ్ఞాసను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. సైన్స్ పరిజ్ఞానాన్ని ప్రదర్శించుకునేందుకు, పెంపొందించుకునేందుకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ చక్కని అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రతి స్కూల్‌లోనూ కనీసం 50 మంది విద్యార్థులను గ్రూపులుగా విభజించి వారితో ఆవిష్కరణలు చేయించాలని సూచించారు.

### ఐవీఎఫ్ కేంద్రాలకు అనుమతి తప్పనిసరి : డీఎంహెచ్ఓ

**పుట్టపర్తి అర్బన్:** జిల్లాలో అనుమతులు లేకుండా ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ సెంటర్ (ఐవీఎఫ్ – సంతాన సాఫల్య కేంద్రం) ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం హెచ్చరించారు. సోమవారం హిందూపురంలో అనుమతి ఉన్న ఏకైక సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రతి నెలా ఐవీఎఫ్ సేవలు పొందుతున్న వారి వివరాలను అధికారులకు సమర్పించాలన్నారు. తల్లిదండ్రులు కావాలన్న దంపతుల ఆశలను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఫీజుల దోపిడీకి తెరలేపినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పాలని హితవు పలికారు. ఐవీఎఫ్ సేవలు అందుబాటులో ఉన్నాయని కానీ, ఉచిత కన్సల్టెన్సీ పేరుతో బోర్డులు ఏర్పాటు చేసినా సదరు ఆస్పత్రుల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు బనాయించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## చెరగని సంతకం..
# మరవలేని జ్ఞాపకం



వైఎస్సార్..ఈ పేరు వినగానే తెలుగునేల మీద ఉన్న ప్రతి గుండె స్పందిస్తుంది. ఆయన జ్ఞాపకాలను తడుముకుంటుంది. మరపురాని మహానేత అంటూ కీర్తిస్తుంది. ఆయన వ్యతిరేకులు సైతం...గొప్ప నాయకుడంటూ వేనోళ్ల పొగడుతారు. గుండె గుడిలో.. బీళ్లుగా మారిన నేల తడిలో ఆయనుంటారు. అందుకే ఆయన భౌతికంగా దూరమై 16 ఏళ్లు గడిచినా ఆయన జ్ఞాపకాలు ఇంకా తడిగానే ఉన్నాయి. సంక్షేమ సారథి చిరునవ్వు పేదల మోముల్లో ఇంకా కనిపిస్తూనే ఉంది.

ఆయన్ను కొలవని పల్లె లేదు
ఆయన్ను తలవని తల్లి లేదు
అవన్నలకు ఆత్మబంధువు
అభాగ్యుల పాలిట కల్పతరువు

కుయ్‌కుయ్ మనే 108 సైరన్‌లో..
పేదవాడి గుండెచప్పుడులో..
కూలి కష్టంలో...రైతు స్వేదంలో..
నిరుపేద ఇంట వెలిగిన అక్షర కాంతిలో..
కూలీలు కలిపే అన్నం ముద్దలో..
అక్కచెల్లెమ్మల అభివృద్ధి పథంలో..
పారే నీరులో...పచ్చని పొలంలో
కనిపిస్తూనే ఉంటారు..

భౌతికంగా దూరమైనా..
నమస్తే అక్కయ్యా... నమస్తే అన్నయ్యా..
నమస్తే తమ్ముడూ.. నమస్తే చెల్లెమ్మా..
అంటూ ఆప్యాయతతో కూడిన ఆ పిలుపు
వినిపిస్తూనే ఉంటుంది.

- ప్రజా సంక్షేమమే రాజన్న శ్వాస
- ఆయన హయాంలో అభివృద్ధికి పెద్దపీట
- జనరంజక పాలనకు ఆయనే చిరునామా
- ఏపీ రూపురేఖలు మార్చిన మహానేత
- నేడు వైఎస్సార్ వర్ధంతి

### మహిళా పక్షపాతి

వైఎస్సార్ తన హయాంలో మహిళాభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. పావలా వడ్డీ పథకం ద్వారా ఎందరో జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపారు. అలాగే ఏ ఆసరా లేని వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్ అందించారు. ఇందిరమ్మ ఇళ్లు, అభయహస్తం, రూ.2లకే కిలో బియ్యం, ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి చెరగని ముద్రవేశారు.





కదిరి మండలం చెర్లోపల్లి వద్ద వైఎస్సార్ హయాంలో నిర్మించిన హంద్రీనీవా రిజర్వాయర్

**కదిరి/అనంతపురం అగ్రికల్చర్:** దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో కుల, మత, పార్టీలకు అతీతంగా పాలన సాగించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించారు. ఆపదలో ఆపన్నహస్తంలా 108 అంబులెన్స్ సేవలు, నడిచే వైద్యశాలగా పేరున్న 104 సేవలను అందుబాటులోకి తెచ్చారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పేదింటి బిడ్డల పెద్ద చదువులకు బాసటగా నిలిచారు. ఆరోగ్యశ్రీ ద్వారా రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఖరీదైన వైద్యం చేయించారు.

**రైతు నేస్తం..**

2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపైనే ఉచిత కరెంటు, విద్యుత్ బిల్లుల మాఫీ చేస్తూ తొలిసంతకంతోనే వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయానికి ఊపిరిపోశారు. ఉమ్మడి జిల్లా రైతులకు చెందిన రూ.70.65 కోట్ల విద్యుత్ బిల్లులు మాఫీ చేశారు. ఐదేళ్లు 1.75 లక్షల వ్యవసాయ మోటార్లకు రూ.వందల కోట్లు విలువ చేసే కరెంటు ఉచితంగా సరఫరా చేశారు. అలాగే 2004కు ముందు రూ.1000 కోట్ల లోపున్న పంట రుణాలను రూ.6,594 కోట్లకు చేర్చారు. పావలా వడ్డీ కింద రూ.44 కోట్లు ఇచ్చారు. పంటల బీమా పథకాన్ని రైతులకు మేలు జరిగేలా మార్పు చేసి అంతులేని బీమా కల్పించారు. 2004–2009 మధ్య వేరుశనగ రైతులకు పంట కోత ఫలితాల ఆధారంగా బీమా కింద ఏకంగా రూ.1138 కోట్లు పరిహారం ఇచ్చారు.

అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.100 కోట్లు ఇచ్చారు. 2008లో 3,03,937 మంది రైతులకు చెందిన రూ.554.92 కోట్ల రుణాలు ఒకేవిడతలో మాఫీ చేశారు. అప్పటికే బ్యాంకులకు రుణాలు చెల్లించిన రైతులకు కూడా ప్రోత్సాహకాల కింద 3,61,269 మందికి రూ.5 వేల చొప్పున రూ.174.04 కోట్లు అందజేశారు. 2004– 2009 వరకు ఆరేళ్ల కాలంలో 28,05,901 మంది రైతులకు రూ.280.88 కోట్ల రాయితీతో 26,02,717 క్వింటాళ్ల వేరుశనగ, అలాగే కంది, ఆముదం లాంటి ఇతర విత్తనాల కోసం రూ.80 కోట్లు ఖర్చు చేశారు. ఇక అనుబంధ రంగాలైన పాడి, పశుపోషణ, పట్టు, పండ్లతోటలు, డ్రిప్, స్ప్రింక్లర్ల రైతులకు కూడా చేయూతను అందించారు. రూ.25 కోట్లు రాయితీ ఇచ్చి పశుక్రాంతి, జీవక్రాంతి కింద 50 శాతం రాయితీతో మేలుజాతి పశువులు, గేదెలు అందజేసి క్షీరవిప్లవానికి శ్రీకారం చుట్టారు. 40 వేల హెక్టార్ల పండ్లతోటల విస్తరణకు రూ.80 కోట్లు సబ్సిడీ ఇచ్చారు. దీంతో అప్పట్లోనే 'ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఏపీ'గా పేరొచ్చింది. రైతులకు బిందు, తుంపర పరికరాలు... ఎస్సీ ఎస్టీలకు వంద శాతం, ఇతర రైతులకు 90 శాతం రాయితీతో ఇచ్చారు. సూక్ష్మసేద్యం విస్తరణకు రూ.280 కోట్లు రాయితీ ఇవ్వడంతో 1.13 లక్షల హెక్టార్లకు చేరుకుంది. ఇవే కాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రజలు ఇప్పటికీ ఆయన్ను గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.

### వైఎస్సార్ హయాంలో ఎంతో అభివృద్ధి

వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శ్రీసత్యసాయి జిల్లా (అప్పట్లో ఉమ్మడి అనంతపురం జిల్లా) ఎంతో అభివృద్ధి చెందింది. ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ఎంతోమందికి లబ్ధి చేకూరింది. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మిల్క్‌బల్క్ చిల్లింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. లోఓల్టేజీ కరెంటుతో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రతి మండలంలో సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వాటి సామర్థ్యాన్ని కూడా పెంచారు.

- కదిరి పట్టణ ప్రజలు తాగునీటికోసం అల్లాడిపోతున్న విషయాన్ని గమనించిన వైఎస్సార్.. ఏకంగా రూ.100 కోట్లతో మంచినీటి పథకాన్ని చేపట్టి శాశ్వత పరిష్కారం చూపారు.
- హంద్రీనీవా పథకం ద్వారా కదిరి ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకొచ్చారు.
- కదిరి మండలం చెర్లోపల్లి వద్ద హంద్రీనీవా రిజర్వాయర్‌ను నిర్మించారు.
- పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాలకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తెచ్చారు.
- ధర్మవరం పట్టణ ప్రజల దాహార్తి తీర్చడం కోసం రూ.84 కోట్లతో 'కేతిరెడ్డి సూర్యప్రతాప్ రెడ్డి శాశ్వత మంచినీటి పథకం' పేరుతో పార్నపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు.
- చేనేత రుణమాఫీతో జిల్లాలోని చేనేతలకు ఆర్థికంగా అండగా నిలిచారు.
- హిందూపురంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు డాక్టర్ వైఎస్సార్ సుమారు రూ.600 కోట్లతో శాశ్వత మంచినీటి పథకాన్ని చేపట్టారు.
- పెనుకొండ నియోజకవర్గానికి హంద్రీనీవా కాలువలు తవ్వించారు.
- మడకశిర నియోజకవర్గంలోని ప్రతి పల్లెకూ రోడ్లు వేశారు. తాగునీటి సమస్య తీర్చారు.
- సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న మడకశిర నియోజకవర్గంలోని రైతుల పరిస్థితి చూసి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004లో హంద్రీనీవా సుజల ప్రవంతి పథకం ద్వారా నియోజక వర్గానికి కృష్ణా జలాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు.
- మడకశిర నియోజకవర్గంలోని వక్కలిగలను బీసీ కేటగిరీలోకి మార్చారు. ఫలితంగా ఆ సామాజిక వర్గంలోని ఎందరో రిజర్వేషన్ ఫలితాలు అందిపుచ్చుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన చేసిన మేళ్లు ఎన్నో... అందుకే జనమంతా ఇప్పుడు ఆయన్ను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు.

## తాగునీటి కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గోపేపల్లితండా వాసులు

**పుట్టపర్తి టౌన్:** గొంతుతడిపే గుక్కెడు నీటి కోసం నల్లమాడ మండలం గోపేపల్లి తండా వాసులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని తీర్చాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో తమ సమస్యపై అర్జీ ఇచ్చేందుకు వచ్చిన గోపేపల్లి తండా వాసులను లోనికి అనుమతించకపోవడంతో తండావాసులు కలెక్టరేట్ ఎదుటే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ తండాలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, నెలకు ఒకసారి గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు బోరు మోటర్ పంప్ కూడా కాలిపోతోందన్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమ సమస్య గురించి పట్టించుకోలేదన్నారు. తాజాగా 20 రోజుల క్రితం బోరు మోటరు కాలిపోవడంతో తాము సమీపంలోని వ్యవసాయ బోరుమోటార్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని వాపోయారు. పంచాయతీ సర్పంచ్ రూ.40 వేల పంచాయతీ నిధులు ఖర్చు చేసినా తాగునీటి సమస్య మాత్రం తీరలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. అనంతరం అధికారులు అనుమతించడంతో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ మేరకు అర్జీ ఇచ్చారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ విద్యుత్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు వారు వెల్లడించారు.

## రాష్ట్రంలో అరాచక పాలన

- 'కూటమి' అరాచకాలకు పోలీసుల వత్తాసు దుర్మార్గం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



గోరంట్లలో విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

**గోరంట్ల:** రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ధ్వజమెత్తారు. ప్రశాంతంగా ఉన్న గ్రామల్లో అధికార పార్టీ నాయకులు చిచ్చు పెడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. సోమవారం ఆమె గోరంట్లలో పర్యటించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని వెంకటరమణపల్లి గ్రామంలో అధికార పార్టీ నాయకులు చేసిన దాడిలో గాయపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వెంకటరమణపల్లిలో వినాయకుని ఊరేగింపు కార్యక్రమాన్ని అధికార పార్టీ నాయకులు అడ్డగించడం హేయమైన చర్య అన్నారు. అధికార పార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలకు కొంతమంది పోలీసు అధికారులు వత్తసు పలకడం శోచనీయమన్నారు. టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ వారిపై దాడులు చేస్తే సీఐ శేఖర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పైగా బాధితులైన వైఎస్సార్ సీపీ నాయకులనే అదుపులోకి తీసుకోవడం అన్యాయమన్నారు. అందువల్లే గ్రామస్తులంతా ధర్నాకు దిగారని, అప్పుడుగానీ సీఐ శేఖర్ ఇరువర్గాలను అదుపులోకి తీసుకోలేదన్నారు. సీఐ శేఖర్ టీడీపీ ఏజెంటుగా వ్యవహరిస్తున్నారని, మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను కావాలనే పోలీసు స్టేషన్ కు పిలిపించి కేసుల పెడతామని బయపెడుతున్నారన్నారు. కొన్నిరోజుల క్రితం సీఐ శేఖర్ కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తను స్టేషన్‌కు పిలిపించి వేధించారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం సభ్యులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే... వెంటనే వారిని స్టేషన్‌కు పిలిపించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. సీఐ శేఖర్ తన పనితీరు మార్చుకోకపోతే పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు, న్యాయం పోరాటం చేస్తామన్నారు. వెంకటరమణపల్లిలో జరిగిన ఘటనలో అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోకపోతే పోలీసు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

**అధికారం కోసమే అలవిగాని హామీలు..**

**పెనుకొండ రూరల్:** అధికారం కోసమే కూటమి పార్టీల నేతలు ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు గుప్పించారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. సోమవారం ఆమె మండలంలోని అడదాకులపల్లిలో 'కాఫీ విత్ వైఎస్సార్ సీపీ' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు.. అధికారంలో చేపట్టిన రోజు నుంచి ప్రజలను వంచిస్తున్నారన్నారు. కొత్తగా పథకాలు ఇవ్వకపోగా.. ఉన్న పథకాల్లోనే కోతలు విధించి ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, సర్పంచ్ అలివేలమ్మ, పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్ రెడ్డి, మండల మాజీ కన్వీనర్లు నాగభూరు బాబు, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు మతసామరస్యాన్ని చాటాలి

- జిల్లా ప్రజలకు ఎస్పీ రత్న పిలుపు
- హిందూపురంలో పోలీసులతో కలిసి కవాతు
- గణేష్ నిమజ్జనం శోభా యాత్ర రూట్ మ్యాప్ పరిశీలన
- మిలాద్–ఉన్–నబీ ఏర్పాట్లపై ముస్లిం మతపెద్దలతో చర్చ



పోలీసులతో కలిసి కవాతు చేస్తున్న ఎస్పీ రత్న

**హిందూపురం:** పండుగలు మతసామరస్యాన్ని చాటాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. ఈ నెల 4వ తేదీ హిందూపురంలో గణేష్ నిమజ్జనం, 5వ తేదీన మిలాద్– ఉన్-నబీ పర్వదినం నేపథ్యంలో సోమవారం ఆమె హిందూపురంలో పర్యటించారు. తొలుత డీఎస్పీ మహేష్‌తో కలిసి పోలీసుల స్కూటర్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఏపీఎస్పీ ప్లటూన్, సాయుధ బలగాలతో కలిసి హిందూపురం ప్రధాన రహదారిలో కవాతు నిర్వహించారు. అనంతరం గణపతి నిమజ్జన శోభా యాత్ర సాగే రూట్లను, విగ్రహాలను నిమజ్జనం చేసే గుడ్డం కోనేరును పరిశీలించారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. రెండు పండుగల సందర్భంగా రెండురోజుల పాటు హిందూపురం ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈనెల 4వ తేదీన గణేష్ నిమజ్జనం సందర్భంగా పట్టణంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆమె స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలతో సమావేశమయ్యారు. మిలాద్–ఉన్– నబి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముస్లిం మత పెద్దలతో చర్చించారు. ఎస్పీ వెంట డీఎస్పీ కేవీ మహేష్, సీఐలు రాజగోపాల్ నాయుడు, కరీం, జనార్దన్, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

## కాలువ భూమిని కబ్జా చేశారు

- జేసీకి ఫిర్యాదు చేసిన పెడపల్లి పెద్దతండా వాసులు
- 'పరిష్కార వేదిక'కు 174 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

**పుట్టపర్తి అర్బన్:** ''బత్తలపల్లి కాలువకు చిత్రావతి నుంచి నీరు వచ్చేందుకు వీలుగా ప్రభుత్వం సర్వే నంబర్178లో 2.9 ఎకరాల భూమిని వదలగా... పెడపల్లి పెద్దతండాకు చెందిన నాగేంద్ర నాయక్ భార్య అరుణాబాయి ఆ భూమిని ఆక్రమించారు. అక్రమంగా డీపట్టా పొంది ప్రస్తుతం భూమిని చదును చేస్తున్నారు. వెంటనే పనులు నిలిపివేయించాలి. రికార్డుల్లోనూ ఆ భూమి కాలువ అనే నమోదై ఉంది. కాలువ పూడ్చి వేస్తే చెరువుకు నీళ్లు వచ్చే వీలు లేకుండా పోతుంది. అదే జరిగితే పెద్దతండా, పైపల్లి గ్రామాలకు తాగు, సాగునీటి ఇబ్బందులు తలెత్తుతాయి. వెంటనే ఆక్రమణలో ఉన్న భూమిని సంరక్షించాలి'' అని పుట్టపర్తి మండలం బత్తలపల్లికి చెందిన వడ్డె వెంకటేషు, రాజేంద్ర ప్రసాద్, రమేష్, బి.వెంకటేషు, వెంకటరాముడు, హరీష్ తదితర రైతులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు అర్జీ అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై మొత్తంగా 175 అర్జీలు అందాయి. జేసీ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ తదితరులు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమం అనంతరం జేసీ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ... అర్జీలకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. ఒక్క అర్జీ కూడా బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకూడదన్నారు.

**వచ్చిన అర్జీల్లో కొన్ని ఇలా...**

- పుట్టపర్తి మండలం గువ్వలగుట్టపల్లి గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా విద్యుదాఘాతంతో నరసింహమూర్తి మృతి చెందారని, ఇది విద్యుత్ శాఖ నిర్లక్ష్యమేనని మృతుని తమ్ముడు నాగేంద్ర జేసీకి ఫిర్యాదు చేశారు. విద్యుత్ వైర్లు కిందకు ఉన్నాయని పలుమార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. నరసింహమూర్తికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని, కుటుంబ యజమాని దూరం కావడంతో వారు అనాథలయ్యారన్నారు. తగిన పరిహారం ఇప్పించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.
- తనకు కనగానపల్లి మండలం పాతపాళ్యం గ్రామంలోని సర్వే నంబర్ 140–3లో 4 ఎకరాల భూమి ఉందని, వెబ్‌ల్యాండ్‌లో మాత్రం తన పేరు కనబడలేదని లక్ష్మీదేవి జేసీకి ఫిర్యాదు చేశారు. వెబ్‌ల్యాండ్‌లో తన పేరు నమోదు చేయాలని అర్జీ సమర్పించారు. గతంలో పలు మార్లు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలిచ్చినా ఫలితం లేదన్నారు.



కాలువ ఆక్రమించారని ఫిర్యాదు చేసిన బత్తలపల్లి రైతులు

## క్లుప్తంగా

### పరిష్కార వేదికకు 45 వినతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 45 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృత దేహం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కియా పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. సంబంధీకులు ఎవరైనా ఉంటే కియా పోలీసులను (93469 17078) సంప్రదించాలని కోరారు.

### బుక్కపట్నంలో విజయనగర రాజుల శాసనాలు


ఆలయంలో బయటపడిన శాసనాన్ని చూపుతున్న ఉపాధ్యాయులు

పుట్టపర్తి: బుక్కపట్నంలోని పురాతన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో విజయనగర సామ్రాజ్యం నాటి రెండు శాసనాలు బయటపడ్డాయి. ఈ మేరకు సోమవారం చారిత్రక పరిశోధకుడు, విశ్రాంత హెచ్‌ఎం వెంగన్న, ఉపాధ్యాయులు గోపీ, సురేష్ వెల్లడించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనుల్లో రెండు రాతి స్తంభాలపై శాసనాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవ రాయలు సోదరుడు అచ్యుత దేవరాయలు ఈ శాసనాలను లిఖించినట్లు తెలిపారు. త్వరలో ఈ శాసనాలపై పూర్తి స్థాయి అధ్యయనం చేయనున్నట్లు వెంగన్న పేర్కొన్నారు.

### ఆంధ్రా ప్రెసిడెంట్ జట్టు కెప్టెన్‌గా కోగటం హనీష్



అనంతపురం: ఆర్డీటీ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్–19 క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఏపీ ప్రెసిడెంట్ జట్టు కెప్టెన్‌గా కోగటం హనీష్ వీరారెడ్డి ఎంపికయ్యాడు. ఆంధ్రా సెక్రెటరీ టీం, ఆంధ్రా ప్రెసిడెంట్ టీం, మధ్యప్రదేశ్, బరోడా జట్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ విధానంలో పోటీలు జరగనున్నాయి. అనంతపురం జిల్లా నుంచి కోగటం హనీష్ వీరారెడ్డి ఒక్కరే ఈ టోర్నీకి ఎంపిక కావడం గమనార్హం.

# ‘సమగ్ర’లో సీతయ్య

- కేజీబీవీ ఎస్‌ఓలను, సిబ్బందిని శాసిస్తున్న చిరుద్యోగి


జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం

పుట్టపర్తి: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఎవరి మాట వినని సీతయ్య అందరిపై పెత్తనం చెలాయిస్తూ ఉద్యోగులకు గుదిబండలా మారాడు. పేరుకే చిరుద్యోగి అయినా.. ఉన్నతాధికారులను సైతం ఖాతరు చేయని అతని బాగోతాలు కథలు కథలుగా వెలుగు చూస్తున్నాయి.

**మెసెంజర్ సిఫారసు ఉంటేనే పని పూర్తి**

డిప్యూటేషన్‌పై జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి నియమితుడైన మెసెంజర్.. బాధ్యతలు తీసుకున్న వెంటనే కార్యాలయం మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఏపీసీ)ని సైతం పక్కన పెట్టి అన్ని అధికారాలు తానై చెలాయిస్తూ కేజీబీవీ సిబ్బందికి చుక్కలు చూపించసాగాడు. ఈ క్రమంలో ఏ పని కావాలన్నా ముందుగా ఆయనను ప్రసన్నం చేసుకోవాలి. లేకపోతే ఏ పనీ పూర్తి కావడం లేదనే ఆరోపణలున్నాయి.

**ప్రతి పనికీ ఓ లెక్క**

మెసెంజర్‌కు ముడుపులు ముట్టజెప్పితేనే సమగ్ర శిక్షలో పనులు పూర్తవుతాయని, లేకపోతే రోజుల తరబడి ఏదో ఒక నెపంతో ఫైల్‌ను పక్కన పెట్టేస్తుంటారని పలువురు బాధితులు వాపోతున్నారు. కేజీబీవీ ఎస్‌ఓల నుంచి బోధన, బోధనేతర సిబ్బంది, ఎమ్మార్సీ, ఇతర సిబ్బంది బదిలీల్లోనూ ఆయనే కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో అతను కోరిన మొత్తాన్ని చెల్లించి పనులు చక్కబెట్టుకుంటున్నట్లు పలువురు ఉద్యోగులు బాహాటంగానే పేర్కొంటున్నారు. ఏపీసీ పరిధిలో ఉన్న ఎమ్మార్సీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీలు ఇటీవల జరిగాయి. అయితే 2 నెలలు గడిచినా వారిని ఇప్పటి వరకూ బదిలీ అయిన స్థానాలకు పంపలేదు. ఈ అక్రమాల వెనుక మెసెంజర్ పాత్ర ఉన్నట్లు ఎమ్మార్సీ సిబ్బంది వాపోతున్నారు.

**గతంలోనూ వివాదాస్పదమే**

గతంలో బాలికల గురుకుల పాఠశాలలో మెసెంజర్‌గా పనిచేసే అవకాశం దక్కినా.. ఆ పాఠశాల బాలికలకు సంబంధించినది కావడంతో ఉన్నతాధికారులు అనుమతించలేదు. దీంతో తనకు ప్రతిగా భార్యకు ఉద్యోగం ఇప్పించి.. అనంతరం కొద్ది రోజులకే కోర్టును ఆశ్రయించి విధుల్లోకి చేరాడు. ఈ క్రమంలో అతని పనితీరు వివాదాస్పదంగానే సాగింది.

**ఎస్‌ఓలకు బెదిరింపు**

కేజీబీవీలకు సంబంధించి బిల్లులు కావాలంటే మెసెంజర్‌కు ముడుపులు చెల్లించక తప్పడం లేదనే ఆరోపణలున్నాయి. అతను కోరుకున్న మొత్తం చెల్లించకపోతే బిల్లులు సక్రమంగా లేవంటూ కొర్రీలు వేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కేజీబీవీ సిబ్బందిని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సమస్యాత్మకంగా మారిన సమగ్ర శిక్ష కార్యాలయ మెసెంజర్‌పై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- హౌసింగ్ పీడీ వెంకటనారాయణ


సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

లేపాక్షి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటనారాయణ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం లేపాక్షిలోని హౌసింగ్ కార్యాలయంలో ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, ఎంపీడీఓ నరసింహమూర్తితో కలసి గృహ నిర్మాణాలపై హౌసింగ్ ఇంజనీర్ల అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. మండల వ్యాప్తంగా వివిధ దశలో 300 ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటి నిర్మాణాలు పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటి నిర్మాణం చేపట్టి పూర్తి చేయని ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు అదనంగా చెల్లిస్తారన్నారు. ఇంటి స్థలాలు ఉండి గృహ నిర్మాణం మంజూరుకు 872 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని, కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 2.50 లక్షలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

# ఏసీబీ చార్జెస్‌పై ప్రజెంటింగ్ అధికారి నియామకం

అనంతపురం అర్బన్: అవినీతి కేసులో విశ్రాంత తహసీల్దారు, మరికొందరు రెవెన్యూ అధికారులపై ఏసీబీ అధికారులు ఫ్రేమ్ చేసిన చార్జెస్‌పై ప్రజెంటింగ్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు సోమవారం జారీ అయ్యాయి. 2020, జనవరి 24న ముదిగుబ్బ తహసీల్దారు కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు, ఆన్‌లైన్‌లో నమోదు, మ్యుటేషన్ తదితర వ్యవహారాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లుగా గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అప్పటి తహసీల్దారు అన్వర్ హుస్సేన్ (ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేశారు), డిప్యూటీ తహసీల్దారు రామకృష్ణ, మండల సర్వేయర్ రత్నాకర్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్–1 సందీప్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఏఎస్‌ఓ చంద్రశేఖర్, మరికొందరిపై ఏసీబీ చార్జెస్ ఫైల్ చేసింది. ఈ వ్యవహారంలో ప్రస్తుతం ప్రజెంటింగ్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఏసీబీ చార్జెస్‌పై ప్రజెంటింగ్ అధికారి విచారణ చేపట్టి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

# వాహనం ఢీ – ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


గాయపడిన నరసింహులు, ముత్యాలు

కనగానపల్లి: మండలంలోని గుంతపల్లి సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన బండి నరసింహులు (59), ముత్యాలు సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై పాతపాల్యం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. గుంతపల్లి సమీపంలోకి చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్ నడుపుతున్న నరసింహులు ఒక కాలు పూర్తిగా విరిగి పక్కకు పడిపోయింది. ముత్యాలుకు మోకాలు విరిగింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించింది. తీవ్రంగా గాయపడిన నరసింహులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య నారాయణమ్మ, ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముత్యాలును అనంతపురంలోని జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. ఘటనపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

# బీఎస్‌ఎన్‌ఎల్ సరికొత్త బేసిక్ ప్లాన్

- రూ.400కే కొత్త ట్రిపుల్ ప్లే ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్
- బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం షేక్ ముజీబ్ పాషా వెల్లడి

అనంతపురం సిటీ: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్‌ఎన్‌ఎల్) రూ.400కే కొత్త ట్రిపుల్ ఎఫ్‌టీటీహెచ్ ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్ ప్రవేశపెట్టింది. ఈ మేరకు ఆ సంస్థ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా సోమవారం వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కొందరు కేబుల్ ఆపరేటర్లు బీఎస్‌ఎన్‌ఎల్ భాగస్వామి(టిప్)గా నమోదై ఎఫ్‌టీటీహెచ్ సేవలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 20 ఎంబీపీఎస్ వేగంతో అపరిమిత ఇంటర్నెట్, అపరిమిత వాయిస్ కాల్స్, 400+ ఉచిత ఛానెళ్లతో పాటు 44 తెలుగు పే ఛానళ్లను వీక్షించవచ్చని స్పష్టం చేశారు. 9 ఓటీటీఎస్ కూడా ఉంటాయని తెలిపారు. ఇంటర్నెట్, టీవీ ఛానళ్లను పొందేందుకు రూ.140తో ప్రీ పెయిడ్ రీచార్జ్ తప్పనిసరి అని పేర్కొన్నారు. డిజిటల్ అగ్రిమెంట్ కోసం రూ.500 మాత్రమే చెల్లించి బీఎస్‌ఎన్‌ఎల్ భాగస్వామిగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓఎల్‌టీ కనెక్టివిటీకి ఎలాంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ.2500+జీఎస్‌టీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఆసక్తి గల కేబుల్ ఆపరేటర్లు బీఎస్‌ఎన్‌ఎల్‌గా భాగస్వామి(టిప్)గా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### రైతు ఆత్మహత్య


మృతుడు నాగేంద్ర

ధర్మవరం రూరల్: మండలంలోని ఆర్.యర్రగుంటపల్లికి చెందిన రైతు మండ్లి నాగేంద్ర (44) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య బొజ్జక్క, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. తనకున్న 5 ఎకరాల పొలంలో వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పంటల సాగుకు బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకోవడంతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. దీనికి తోడు కుటుంబంలో కలహాలు మొదలు కావడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన సోమవారం రాత్రి కలుపు నివారణ మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న నాగేంద్రను కుటుంబసభ్యులు గమనించి ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### ప్రేమ విఫలం.. బీటెక్ విద్యార్థి ఆత్యహత్య

తాడిపత్రి రూరల్: ప్రేమ విఫలమై తాడిపత్రి మండలం ఆలూరు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి నవీన్‌కుమార్ (19) ఆత్మహత్య చేసుకున్నాడని సోమవారం అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పట్టణ సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న నవీన్‌కుమార్ ఆదివారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ఆస్పత్రికి తరలించగా... పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### బాస్కెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


పుట్లూరు సోహన

అనంతపురం: బాస్కెట్ బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు జిల్లాకు చెందిన పుట్లూరు సోహన ఎంపికైంది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు పంజాబ్‌లోని లూధియానాలో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి.

# వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

అనంతపురం: ప్రేమించి.. మతాంతర వివాహం చేసుకున్న యువతి.. భర్త వేధింపులు తాళలేక అర్ధాంతరంగా తనువు చాలించింది. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని చాకలి వీధిలో నివాసముంటున్న చాకలి అయ్యప్పకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె సవిత (24)కు ఐదేళ్ల క్రితం అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి ఫోన్‌లో పరిచయమయ్యాడు. డ్రైవింగ్‌తో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారడంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వచ్చేసిన సవిత దస్తగిరిని పెళ్లి చేసుకుంది. అనంతరం తన పేరును దూదేకుల రేష్మాగా మార్చుకుంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఏడాదిగా అనంతపురం నగరంలో కాపురం ఉంటున్నారు. అయితే సవితతో పెళ్లి ఇష్టం లేని దస్తగిరితో పాటు అతని తల్లి ఇమామ్‌బీ, అక్క నూర్జహాన్ తరచూ వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. ‘నువ్వు చచ్చిపోతే.. మా కులానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాం’ అంటూ శారీరకంగా, మానసికంగా వేధించేవారు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో దస్తగిరి తరచూ సవితపై భౌతిక దాడులకు పాల్పడేవాడు. వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో గత నెల 31న రాత్రి 9 గంటల సమయంలో సవిత విషపూరిత ద్రావకం తాగింది. విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు దస్తగిరి ఫోన్ చేసి తెలిపి, అనంతపురంలోని జీజీహెచ్‌లో చేర్పించినట్లు వివరించాడు. దీంతో సవిత కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని పరిశీలించారు. చికిత్సకు స్పందించక సోమవారం అర్ధరాత్రి ఆమె మృతి చెందింది. ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అనంతపురం మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ తెలిపారు.

### చెరువులో పడి యువకుడి మృతి


మహేష్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని మార్కెట్ వీధికి చెందిన మహేష్ (36)కు భార్య విమల, ఓ కుమారుడు ఉన్నారు. వినాయక నిమజ్జనం నేపథ్యంలో చెరువు మొదటి మరువ వద్ద సోమవారం ఉదయం తన శరీరానికి అయిన రంగులను శుభ్రం చేసుకుంటుండగా అదుపు తప్పి నీటిలో పడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న మహేష్ చెరువులోని బురదలో కూరుకుపోయి బయటకు రాలేక మృతి చెందాడు. గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది అక్కడకు చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### పాత కక్షలతో దాడి


చికిత్స పొందుతున్న శ్రీనివాసులు, చెన్నయ్య

కదిరి అర్బన్: మండలంలోని పట్నం గ్రామంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న దాడుల్లో నలుగురికి గాయాలయ్యాయి. పట్నం గ్రామానికి చెందిన వెంకటేష్, చెన్నయ్య, శ్రీనివాసులు, ఆయన కుమార్తె అంజలిపై అదే గ్రామానికి చెందిన సూరి, ఆయన కుమారులు అరవింద్, అశోక్, నాని కొడవలితో దాడి చేశారు. పశువుల మేత మేస్తున్న ప్రదేశానికి సంబంధించి ఆదివారం రాత్రి వెంకటేష్ బంధువుకి, సూరికి మధ్య గొడవ జరిగింది. గతంలోనే వీరి మధ్య గొడవలు ఉన్నాయి. పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని దాడులకు పాల్పడినట్లు సమాచారం. క్షతగాత్రులను కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు కేసు దర్యాప్తు చేపట్టిన సీఐ నిరంజనరెడ్డి తెలిపారు.

# నకిలీ విత్తనాలతో నిండా ముంచారు

- తాడిపత్రిలో రైతుల ఆందోళన


మధుసాయి ట్రేడర్స్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

తాడిపత్రి రూరల్: నకిలీ విత్తనాలు అంటగట్టి నిండా ముంచారని రైతులు వాపోయారు. పట్టణంలో వైఎస్సార్ సర్కిల్‌లోని మధుసాయి ట్రేడర్స్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. బాధిత రైతులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలం శెట్టివారిపల్లికి కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి వెళ్లి తాను తాడిపత్రిలోని మధుసాయి ట్రేడర్స్‌కు చెందిన ఉద్యోగిగా అక్కడి రైతులతో పరిచయం పెంచుకున్నాడు. తమ వద్ద సోహా 007 రకం మొక్కజొన్న విత్తనాలు ఉన్నాయని, 110 రోజుల్లోనే పంట దిగుబడి వస్తుందని ఆశ చూపి 30 మంది రైతులకు అంటగట్టాడు. దీంతో ఎకరాకు రూ.40 వేల నుంచి 45 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసిన రైతులు 90 రోజులు కావస్తున్నా పంట సరిగా ఎదగక పోవడంతో మోసపోయిన గుర్తించి తాడిపత్రికి వచ్చి మధుసాయి ట్రేడర్స్ యజమానికి పరిస్థితి వివరించారు. అయినా ఆయన పట్టించుకోక పోవడంతో బాధిత రైతులు సోమవారం తాడిపత్రికి వచ్చి దుకాణం వద్ద ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేసేంతవరకు వెళ్లేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న ఏడీఏ రవి ఆదేశాల మేరకు పెద్దపప్పూరు ఏఓ మహితా కిరణ్ అక్కడకు చేరుకుని దుకాణంలోని మొక్కజొన్న విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. విచారణ తరువాత కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేస్తామని ఏడీఏ భరోసానిచ్చారు.

### డీజే సౌండ్.. గుండెపోటుతో కార్మికుడి మృతి

రాయదుర్గం టౌన్: వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే సౌండ్ కారణంగా మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడు పూలకుంట శ్రీనివాసులు (36) గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఈ ఘటన అనంతపురం జిల్లా రాయదుర్గంలో చోటుచేసుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు కాలనీలో కొలువుదీర్చిన గణేష్ నిమజ్జనంలో ఆదివారం రాత్రి పాల్గొన్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల ప్రాంతంలో డీజే శబ్దాలకు తీవ్ర అస్వస్థతకు లోనై ఇంటికి చేరుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కాగా, రెండు నెలల క్రితమే ఆయన గుండె సంబంధిత చికిత్స పొందినట్లు బంధువులు, తోటి కార్మికులు తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్, పారిశుధ్య మేస్త్రీలు అంబేడ్కర్ కాలనీకి చేరుకుని మృతుడికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నివాళులర్పించిన వారిలో వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలీబాషా, కౌన్సిలర్లు ఉన్నారు.

# చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- సంపద సృష్టి పేరుతో ప్రజల నెత్తిన రూ.2 లక్షల కోట్ల అప్పుల భారం
- ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాలు వివరించాలని పిలుపు
- వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ సదస్సులో రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి



సదస్సులో ప్రసంగిస్తున్న అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి

కర్నూలు(టౌన్): అధికారం కోసం అబద్ధాలు చెప్పిన సీఎం చంద్రబాబును నిలదీద్దామంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ సదస్సు పార్టీ జిల్లా అధ్యక్షురాలు శశికళ అధ్యక్షతన జరిగింది. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తొలుత వరుదు కళ్యాణి ప్రసంగించారు. ఎన్నికలకు ముందు మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఏడాదిన్నర గడిచినా ఒక్కటీ అమలు చేయలేకపోయారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర పాలనలో ప్రజా వ్యతిరేకత కూడగట్టుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు ఏడాదిన్నర కాలంలోనే ప్రజల నెత్తిన రూ.2 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపారన్నారు. రాష్ట్రంలో 24 శాతం మద్యం అమ్మకాలు పెరగడంతోనే మహిళలపై దాడులు, అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. జగనన్న వల్లే మహిళా సాధికారత సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టడం చంద్రబాబు ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. జైళ్లకు పంపిస్తే భయపడే ప్రసక్తే లేదన్నారు. జగనన్న కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తామన్నారు. జగనన్న హయంలో మహిళలు బంగారం కొనుగోలు చేస్తే, ఈ ప్రభుత్వంలో బంగారాన్ని అమ్ముకునే పరిస్థితులు ఉన్నాయన్నారు. సమావేశంలో సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు సి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.